# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 149 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | మంగళవారం, 28 ఏప్రిల్ 2026 | పేజీలు : 4




## టోకెన్ పద్ధతిని పాటించాలి

- జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

3




### జనగామ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌పై

# విజిలెన్స్

- అక్రమ రిజిస్ట్రేషన్లపై నజర్
- పలు డాక్యుమెంట్ల స్వాధీనం

3

జనగామ సబ్ రిజిస్టర్ కార్యాలయంపై విజిలెన్స్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో సోమవారం కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కొన్ని రోజులగా కార్యాలయంలో అనేక తప్పుడు డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అవుతున్నట్టు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో అధికారులు ఈ తనిఖీలు చేపట్టినట్టు తెలుస్తోంది.

- మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి



### ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అజారుద్దీన్

# ప్రమాణస్వీకారం

- ప్రమాణం చేయించిన మండలి చైర్మన్ గుత్తా
- హాజరైన సీఎం రేవంత్, మంత్రులు

**హైదరాబాద్, మన చౌరాస్తా :** ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, అజారుద్దీన్ ప్రమాణస్వీకారం చేశారు. మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వారితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు పలువురు మంత్రులు హాజరయ్యారు. గవర్నర్ కోటాలో కోదండరాం, మహమ్మద్ అజారుద్దీన్‌లను ఎమ్మెల్సీలుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆదేశాల మేరకు సాధారణ పరిపాలన శాఖ ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రమాణస్వీకారం అనంతరం ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ.. తనకు మంత్రి పదవిపై ఆశ లేదని వ్యాఖ్యానించారు. పదవులు అనేవి శాశ్వతం కాదని స్పష్టం చేశారు. ఒకాయన తాను పోరాడాతానా లేదా అని అన్నారని.. తాను పోరాడి చూపిస్తానని చెప్పుకొచ్చారు. గతంలో తనపై అనేక కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అయిన తన పని ఆగలేదని.. కొనసాగుతోందని స్పష్టం చేశారు. వివాదాస్పద సమస్యకు పరిష్కారం లభించిందని అన్నారు. లక్ష్యాలను ఎంచుకొని పనిచేస్తానని స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యమకారుల సమస్యలు, ఆదివాసుల





సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తానని అన్నారు. ఇప్పటివరకు చేస్తున్న పనిని సమర్థవంతంగా పూర్తి చేయడానికి తనకు ఎమ్మెల్సీ ఉపయోగపడుతుందని వెల్లడించారు. జయశంకర్‌కు ఇచ్చిన మాట ప్రకారం ముందుకు పోతానని తెలిపారు. గతంలో ఏ రకంగా తన జీవన శైలి ఉందో.. భవిష్యత్తులో కూడా అదేవిధంగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తాను నిలబడతానని.. వారికి ఎప్పుడు అందుబాటులో ఉంటానని కోదండరాం పేర్కొన్నారు మంత్రి అజారుద్దీన్ మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్సీగా తనను ప్రతిపాదించిన కాంగ్రెస్ అధిష్ఠానానికి, మంత్రి మండలికి, పీసీసీకి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. మైనార్టీల సంక్షేమం కోసం మరింత కృషి చేస్తానన్నారు.








# హిందూ ధర్మ రక్షణకు నడుంబిగించాలి

## సద్గురు లక్ష్మీనారాయణ గురు భవానీ

**జనగామ, మన చౌరాస్తా :** హిందువుగా పుట్టిన ప్రతి ఒక్కరూ హిందూ ధర్మాన్ని పరిరక్షించేందుకు నడుం బిగించాలని శ్రీ బాలా మానసా మహా విద్యా పీఠం సద్గురు లక్ష్మీనారాయణ గురు భవానీ పిలుపునిచ్చారు. జనగామలోని అంబేద్కర్ నగర్, ధర్మకంచ, గుండ్లగడ్డ ఏరియాల హిందూ సమ్మేళన సభ ఆదివారం రాత్రి స్థానిక జ్యూబీ ఫంక్షన్ హాల్లో జరిగింది. ఈ సభకు సమ్మేళన కమిటీ అధ్యక్షుడు వలబోజు సురేందర్ అధ్యక్షత వహించగా.. లక్ష్మీనారాయణ గురు భవానీ స్వామిజీతో పాటు ఆర్ వాయిస్ జర్నలిస్ట్ నవత, రిటైర్ ప్రొఫెసర్, ఆర్ఎస్ఎస్ వరంగల్ విభాగ్ సంచాలకులు చిలకనూరి సంజీవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ ధర్మాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కుటుంబంలోనే సనాతన సంప్రదాయాలు, నైతిక విలువలు పెంపొందించాలని, యువత ధర్మబద్ధమైన జీవన విధానాన్ని అనుసరించాలని సూచించారు. సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవం పెంపొందించుకోవడం ద్వారా ధర్మ పరిరక్షణ సాధ్యమవుతుందని వివరించారు. అలాగే సమాజ సేవ, ధాతృత్వం, సహనంతో కూడిన జీవనం ద్వారా వ్యక్తిగతంగా మాత్రమే కాక సమాజానికి కూడా మేలు చేకూరుతుందని స్వామిజీ వివరించారు. తల్లిదండ్రులు పిల్లలకు మంచి విలువలు బోధించడం ద్వారా భవిష్యత్ తరాలను సన్మార్గంలో నడిపించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో హిందూ సమ్మేళన సభ కమిటీ సభ్యులతో పాటు ఆయా వార్డుల పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.





# సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఆర్టీసీ కార్మికుల చిరకాల కోరిక మేరకు ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసినందుకు జనగామ ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేక చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్టీసీ బీసీ ఉద్యోగుల గౌరవ అధ్యక్షులు, జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ బనుక శివరాజ్ యాదవ్ హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 39000 వేల మంది ఉద్యోగులు, కార్మికులు ఆర్టీసీలో పనిచేస్తూ ఇప్పటి వరకు ఎలాంటి ప్రభుత్వ బెనిఫిట్స్ లేకుండా, పీఆర్సీ లేకుండా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేకుండా, వారు పనిచేస్తున్న విషయాన్ని గమనించి రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి గొప్ప నిర్ణయం తీసుకొని ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం శుభ పరిణామం అన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో సూపరింటెండెంట్ యాదమని, జనగామ ఆర్టీసీ డిపో బీసీ సంక్షేమ సంఘం ఉద్యోగ నాయకులు GR లింగం, దుర్గయ్య, అంజయ్య , కిషన్, నరేందర్, శ్రీకాంత్, LL పతి , రాజు, సతీష్, రమేష్, శీను, రఘు, వీరస్వామి పాల్గొన్నారు.



# మే డేను ఘనంగా నిర్వహించాలి

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లాలో కార్మిక సంఘాల కార్యకలాపాలు మరింత వేగవంతమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు కొనసాగుతున్నాయి. సోమవారం మధ్యాహ్నం జనగామ జిల్లా సీపీఐ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఏఐటీయూసీ జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సుమారు 20 మంది కార్మికులు పాల్గొన్నారు. అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో ఏర్పడిన 140వ మేడే వేడుకలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మేడే సందర్భంగా నిర్వహించాల్సిన కార్యక్రమాలపై చర్చించి, కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు.

# బీఆర్ఎస్‌ను అధికారంలోకి తేవడమే లక్ష్యం

## -ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** రాబోయే ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరేయడమే లక్ష్యంగా ప్రతి కార్య కర్త కలిసికట్టుగా పని చేయాలని భారత రాష్ట్ర సమితి మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల గణేష్ పిలుపునిచ్చారు. సోమవారం స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఛాగల్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపాలిటీ కన్వీనర్ కనకం గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు, ఉద్యమకారుడు ఇనుగాల నరసింహారెడ్డి గులాబీ జెండాను ఎగురవేశారు. అనంతరం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాచర్ల గణేష్ మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావంలో బీఆర్ఎస్ పార్టీ పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. ఈ పార్టీ కేవలం రాజకీయ సంస్థ మాత్రమే కాకుండా ప్రజల ఆశయాల ప్రతిబింబమని పేర్కొన్నారు. అలాగే కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలో రాష్ట్రంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాయని తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ డైరెక్టర్ ఆకుల కుమార్, మాజీ సర్పంచ్ తాటికొండ సురేష్ కుమార్, మండల కన్వీనర్ తోట సురేందర్, కౌన్సిలర్లు పొన్న రాజేష్, బాలగని అనిల్ గౌడ్, తాటికొండ మధు, బూర్ల రాజేశ్వర్, నాయకులు బూర్ల రమేష్, గుండె మల్లేష్, గుండె రంజిత్, గుర్రం శంకర్, జబ్బార్, సుజాత, రమాదేవి, జ్యోతి రెడ్డి, నాగపురి పావని, చిట్టిబాబు, అన్నెపు అనిల్, ఆకుల నర్సింగం, మాచర్ల అశోక్, ఎండి రాజమహద్, బాస్కుల సుధాకర్, హీరాసింగ్ తదితరులు హాజరయ్యారు.





# ఎన్యుమరేటర్ల రెండు రోజుల శిక్షణ ప్రారంభం

**దేవరుప్పల, మన చౌరాస్తా :** మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో జనాభా గణన కార్యక్రమం భాగంగా ఎన్యుమరేటర్లకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ శిక్షణను మండల విద్యాశాఖాధికారి డాక్టర్ కళావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనాభా గణనలో ఎన్యుమరేటర్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రతి ఇంటిని సమగ్రంగా సందర్శించి, ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించాలని సూచించారు. శిక్షణలో గణన విధానం, డేటా నమోదు పద్ధతులు, ప్రజలతో వ్యవహరించే తీరు వంటి అంశాలపై వివరణాత్మకంగా మార్గనిర్దేశం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, శిక్షకులు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

# పాలకుర్తిలో చలివేంద్రం ప్రారంభం



**పాలకుర్తి, మన చౌరాస్తా :** మండల కేంద్రంలో హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, హనుమండ్ల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండాకాలంలో ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించడం ఎంతో అవసరమని, చలివేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రయాణికులు, కార్మికులు, స్థానిక ప్రజలకు ఉపశమనం కలుగుతుందని తెలిపారు. సేవా భావంతో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న ట్రస్ట్ సభ్యులను వారు అభినందించారు. కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి గౌడ్, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# టోకెన్ పద్ధతిని పాటించాలి

- కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు ఉండాలి
- వేసవి జాగ్రత్త లు తీసుకోండి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ, మన చౌరాస్తా :** జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ టోకెన్ పద్ధతి ప్రకారంగా జరగాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కేంద్ర నిర్వాహకులను, వ్యవసాయ, సివిల్ సప్లై అధికారులను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. జగనామ మండలం పెంబర్తిలో ఏర్పాటు చేసిన ఐకేపీ, పీఏసీఎస్‌కి సంబంధించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం కలెక్టర్ ఆకస్మికం గా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ధాన్యం కొనుగోలు వివరాలు, అందుబాటులో ఉన్న టార్పాలిన్ కవర్లు, గన్ని బ్యాగులు, కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులకు తరలింపు తదితర వివరాలను నిర్వాహకులని అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగేందుకు మూడు దశల్లో టోకెన్ పద్ధతిని పెట్టడం జరిగిందని, దీనిని ఆయా శాఖల అధికారులు తూచ తప్పకుండా పాటించాలని, తద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తేమ శాతం వచ్చిన ధాన్యం వేగంగా కొనుగోలు జరుగుతుందన్నారు. కొనుగోలు ప్రక్రియ పూర్తి కాగానే వెంటనే ట్యాగ్ చేసిన మిల్లులకు ధాన్యం బస్తాలను తరలించాలన్నారు. రవాణా పరంగా కూడా ఎలాంటి ఆలస్యం లేకుండా తగు లారీలను నిర్వాహకులు కేంద్రాలకు సరైన సమయంలో వచ్చేలా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ సూచించారు. వేసవి ఎండల నేపథ్యంలో రైతులు తగు జాగ్రత్త లు తీసుకోవాలని, ఇచ్చిన టోకెన్ల ఆధారంగా కేంద్రాలకు రావాలన్నారు. అలాగే కేంద్రాల్లో తాగునీరు, నీడ తదితర మౌలిక వసతులు ఉండేలా చూసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

## రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదు

జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరగాలని, రైతులకు ఇబ్బందులు కలిగితే అందుకు కారణం అయిన వారిపైన చర్యలు తప్పవని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియ మీద సోమవారం మినీ కాన్ఫెరెన్స్ హాల్లో వ్యవసాయ, ఐకేపీ, సివిల్ సప్లై, రవాణ, మార్కెటింగ్ శాఖ ల అధికారులతో కలెక్టర్ రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి అయ్యేంతవరకు సంబంధిత అధికారులు అలర్ట్ గా ఉండాలన్నారు. అలసత్వం, నిర్లక్ష్యం వహించి రైతులకు ఇబ్బందులు పడే పరిస్థితులను కలిగిస్తే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బెన్ షాలోం, జిల్లా వ్యవసాయ అధికారి



అంబికా సోని, సివిల్ సప్లై డీఏం హతీ రామ్, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, జిల్లా మార్కెటింగ్ అధికారి రామ కృష్ణ, ఇంచార్జి డీఆర్డీవో నూరోద్దీన్, ఇంచార్జి డీసీఎస్‌వో పావని తదితరులు పాల్గొన్నారు.






# ప్రజావాణి అర్జీలకు అధిక ప్రాధాన్యం

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ, మన చౌరాస్తా :** ప్రజావాణిలో వివిధ సమస్యలతో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోంతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా 247 ఆర్జీలను కలెక్టర్ స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందించి, ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజావాణిలో ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, ఇన్‌చార్జి డీఆర్‌డీఓ నూరుద్దీన్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, డీఎంహెచ్‌ఓ మల్లికార్జున రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## జనగామ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌పై

# విజిలెన్స్

- అక్రమ రిజిస్ట్రేషన్లపై నజర్
- పలు డాక్యుమెంట్లు స్వాధీనం

**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :**

జనగామ సబ్ రిజిస్టర్ కార్యాలయంపై విజిలెన్స్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో సోమవారం కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కొన్ని రోజులగా కార్యాలయంలో అనేక తప్పుడు డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అవుతున్నట్టు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో అధికారులు ఈ తనిఖీలు చేపట్టినట్టు తెలుస్తోంది. రెండు రోజుల కింద బదిలీ అయిన సబ్ రిజిస్ట్రార్ కరుణ డాక్యుమెంట్ రైటర్లు, కార్యాలయ సిబ్బందితో పాటు ఓ రాజకీయ నాయకుడు కలిసి ఈ అక్రమాలకు పాల్పడినట్టు ప్రచారం జరుగుతోంది. 15 ఏళ్ల కింద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి పేరుతో తప్పుడు ఆధార్ కార్డులను సృష్టించి లక్షల విలువైన ఆస్తిని ఇతరులకు బదిలీ చేసినట్లు తెలుస్తోంది. ఆ తరువాత అదే ఆస్తిని మరో ఇద్దరికి కూడా బదిలీ చేసి లింకు డాక్యుమెంట్లను కూడా క్రియేట్ చేసి ఆ ప్రాపర్టీని రూ.45 లక్షలకు మరో వ్యక్తికి బదిలీ చేయాలని భావించారు. ఈ క్రమంలో గుట్టు బయటకు పొక్కింది.

### అసలు కథ ఇది..

జనగామ పట్టణంలోని ధర్మకంచ మల్లన్న గుడి వద్ద ఉన్న టీఎన్జీవోస్ కాలనీలో భారతి చంద్రయ్య అనే వ్యక్తికి సంబంధించిన 200 గజాల ప్లాటును వారి కుటుంబ సభ్యులకు తెలియకుండా ఈ ముఠా తప్పుడు ఆధార్ కార్డులను సృష్టించి సదరు ప్రాపర్టీని చేతులు మార్చారు. ఈ ఫోర్జరీ డాక్యుమెంట్ల సృష్టి కర్త ఎవరు? ఇక్కడ పనిచేసిన సబ్ రిజిస్ట్రార్ ఎందుకు సదరు ప్లాటును డాక్యుమెంట్లు అంత సులభంగా బదిలీ చేశారు? దీని వెనుక ఎవరున్నారు? అనే కోణంలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేస్తున్నట్లు తెలుస్తుంది.



### ప్రతీ పనికి ఓ రేటు..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రతి పనికి ఓ రేటు నిర్ణయించి డాక్యుమెంట్ రైటర్ల ద్వారా అడ్డగోలుగా అక్రమ లావాదేవీలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అక్రమ దందాకు అలవాటు పడిన అధికారులు ఏకంగా చనిపోయిన వ్యక్తుల పేర్లతో వారి కుటుంబ సభ్యుల ప్రమేయం లేకుండా ఆధార్, తదితర గుర్తింపు కార్డులను సృష్టించి అక్రమాలకు పాల్పడుతున్నారంటే ఎంతకు తెగించారో అర్థం చేసుకోవచ్చు.

### రాత్రికి రాత్రే..

ఇలాంటి ఆరోపణలు తరచూ రావడంతోనే సోమవారం విజిలెన్స్ అధికారులు దాడి చేసినట్లు తెలుస్తుంది. దాడులు నిర్వహించిన అధికారులు కార్యాలయం నుంచి పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుని వెళ్లారు. ఒకటి రెండు రోజుల్లో సబ్ రిజిస్టర్ కార్యాలయం అక్రమాలన్ని బట్టబయలై అవుతాయని వరంగల్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ రాకేష్, ఎఫ్ఆర్ఓగౌతమ్ రెడ్డి, తహసీల్దార్ లక్ష్మణ్ పేర్కొన్నారు. అయితే ఈ అక్రమ దందాకు తెరలేపిన సబ్ రిజిస్టర్ గుట్టు రట్టు కావడంతో రాత్రికి రాత్రి ఇక్కడ నుండి బదిలీ కావడం మరింత అనుమానాలకు తావిస్తుంది.



# భక్తిశ్రద్ధలతో శాంతి కళ్యాణం

**జనగామ, మన చౌరాస్తా :** శ్రీ నగేశ్వర వాసవి కన్యకా పరమేశ్వరి శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయం మూడో వార్షికోత్సవ సందర్భంగా గత రెండు రోజులగా పెద్ద ఎత్తున పూజా కార్యక్రమలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా హోమం, కలశాభిషేకం, కుంకుమార్చన, శోభయాత్ర తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం మహాపూర్ణాహుతి, శాంతి కళ్యాణం నిర్వహించి అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. బ్రహ్మశ్రీ అప్పయ్య శాస్త్రి, శ్రీమాన్ కృష్ణమాచార్య సిద్ధాంతి సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

## ధనుష్‌తో మరోమారు

# వెంకీ అట్లూరి

తమిళ నటుడు ధనుష్‌తో 'సార్' సినిమా తీసి విజయం అందుకున్నారు తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి. అప్పటి నుంచి వీరిద్దరి మధ్య బంధం బలపడింది. ధనుష్ నటించిన ఏ సినిమా తెలుగులో విడుదలైనా వెంకీ అట్లూరి ప్రమోషన్స్‌లో భాగమవుతున్నారు. 'సార్' కాంబినేషన్‌లో మరో సినిమా వస్తుందని చాలాకాలంగా టాక్ నడుస్తోంది. ఈ రూమర్స్ నిజమేనని స్పష్టమైంది. హైదరాబాద్‌లో జరిగిన 'కర' ప్రీరిలీజ్ ఈవెంట్‌కు వెంకీ అట్లూరి గెస్ట్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ధనుష్ వెంకీని ఉద్దేశించి మాట్లాడుతూ 'చివరి నిమిషంలో పిలిచినా వచ్చినందుకు థ్యాంక్స్. మీరు నాకు బ్రదర్‌లాంటివారు. 'సార్' లాంటి మంచి చిత్రాన్ని నాకు ఇచ్చారు. 'సార్' తర్వాత మీరో కథ నెరేట్ చేసి.. అదృశ్యమయ్యారు. ఆ కథను సంపూర్ణంగా తీసుకురండి. సినిమా చేయడానికి నేను రెడీగా ఉన్నా. మీ సక్సెస్‌కు చాలా ఆనందిస్తున్నా. మీ గత చిత్రం 'లక్కీ భాస్కర' చాలా నచ్చింది. మీ రాబోయే సినిమా 'విశ్వనాథ్ అండ్ సన్స్' కు కూడా శుభాకాంక్షలు' అని అన్నారు. ధనుష్ నటించిన 'కర' సినిమా ఈ నెల 30న విడుదల కానుంది.




Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**